# అభిమానం

ఆఫీసులో దినపత్రిక తిరగేస్తోన్న వెంకట్రావు మూడో పేజీకి రాగానే ఉలిక్కిపడ్డాడు. ఆ ప్రకటన, తాను ఎన్నాళ్ళబట్టో కలలు కంటోన్న ప్రకటన, కంట బడగానే, తన కళ్ళని తానే నమ్మలేక, కళ్ళు మరీ పెద్దవి చేసుకొని గబగబా చదివేశాడు. ఆఖరు వంక్తిలో - హరిజనుల కోసం ఒక పోస్టు ప్రత్యేకించబడిందని చదవగానే, అతని గుండెలు ఆగి మరీ తీవ్రంగా కొట్టుకోసాగాయి. ఇకనేం అంతా తేలిపోయింది; తానింక అఫీసరు కాక తప్పదు. అతని కళ్ళకి ఆ ప్రకటన సాక్షాత్ పబ్లిక్ సర్వీసు కమిషను వాళ్లు పంపించిన ప్రత్యేక ఆహ్వానంగా కనిపించింది. "రండి వెంకట్రావుగారూ! ఇంకా ఎన్నాళ్ళీ గుమాస్తాగిరి వుద్యోగంలో వుంటారు? రండి. ఈ ఆఫీసరు పదవి స్వీకరించండి," అంటూ ఆహ్వానిస్తూన్నట్టుగా తోచింది.

కోటు కాలరు సవరించుకుని తిరిగి చదివాడు. ఊహుఁ, తృప్తి కలగలా. జేబురుమాలు తీసి మొహాన అమితంగా పోస్తోన్న చెమట

బిందువుల్ని తుడుచుకొని, కుర్చీలో నింపాదిగా కూచుని, మరోసారి ఒక్కొక్క పదాన్నే ఉచ్చరిస్తూ, ఉవ్విళ్ళూరుతూ చదవటం మొదలెట్టాడు. చదువుతూన్న కొద్దీ అతని హృదయం పిల్లిమొగ్గ లేయటం మొదలెట్టింది. ఆఖరికి సంతోషం గుండెల దాకా నిండి, ఊపిరి సలపక, ఉక్కిరి బిక్కిర యాడు. ఆ సంతోషాన్ని వెంటనే బయట పెట్టక పోతే గుండెల్ని చీల్చి పెకిలి వొచ్చేస్తుందేమోనన్న భయం కూడా కలిగింది.

చప్పున లేచి నిలచుని చుట్టూ కలయ చూశాడు. అందరూ ఎవరి పనుల్లో వారున్నారు. వాళ్ళని చూడగానే వెంకట్రావు, తలపై కుండెడు చన్నీళ్లు కుమ్మరించినట్టుగా చల్లబడిపోయాడు. తిరిగి దిగాలుగా కుర్చీలో కూలబడి పోయాడు. "ఎవరికి చెప్పుకోను? ఎట్లా చెప్పుకోను?" ...ఏమీ తోచలా. రెండు చేతుల్లో తలనాన్చి, పత్రికేసి శూన్యంగా చూస్తూ కూచున్నాడు.

కొద్ది క్షణాల శాంతత తర్వాత పత్రికలోని ప్రకటన తిరిగి సెగ వేయటం మొదలెట్టింది. గుండెలు మళ్ళీ కొట్టుకోసాగాయి. ఇంక అక్కడ ఒక్క క్షణం కూడా నిలవలేక పోయాడు. వెంటనే సెలవు చీటీ రాసేసి పత్రిక మడచి చంకలో పెట్టుకుని గబగబా ఆఫీసు మెట్లు దిగి వీధిలో పడ్డాడు.

తిన్నగా వెళ్ళి పబ్లిక్ గార్డెన్స్ చేరుకున్నాడు. అక్కడో చెట్టుకింద చల్లని పచ్చిక బయలుపైన చతికిలబడి, కోటు విప్పేసి, వెల్లకిలా పడుకుని కళ్లు మూసుకున్నాడు. అలా కొంత సేపు ఆలోచనా రహితంగా పడుకున్నాక బుర్ర కాస్త తేలిక పడ్డట్టనిపించింది. లేచి కూచున్నాడు. సిగరెట్టు వెలిగించి, దీర్ఘంగా పీలుస్తూ, చుట్టలు చుట్టలుగా పొగ వూదటం మొదలెట్టాడు. ప్రక్కనే పడివున్న పత్రిక పైకి దృష్టి పోయింది. అప్రయత్నంగా కళ్లు ఆ ప్రకటన పైనే నిలిచాయి. సిగరెట్టు పొగలాంచే ప్రకటన్ని దీక్షగా చూస్తున్నాడు.

ఈసారి ప్రకటన చదువుతోంటే ఒకవేపు నించి ఆనందం పొంగు కొస్తోంటే మరోవేపునించి గుండెలు బరువెక్కుతూ వచ్చాయి. కొద్దిసేప ట్లోనే మనసంతా తిరిగి చెదరిపోయింది. చేతికందిన పండుని నోట్లో వేసు కునే శక్తి లేక చేతులారా జారవిడిచేయాల్సి వస్తుందేమోనన్న దిగులు పట్టుకుంది. వెంటనే సిగరెట్టు పీకని దూరంగా గిరాటువేసి, తిరిగి వెల్లకిలా పడుకుని, ఆకాశం కేసి చూస్తో తీవ్రంగా ఆలోచించ సాగాడు.

ఏం? తనకెందుకా శక్తి లేదూ? ఇందులో మహా చెయ్యాల్సిన గొప్ప పనేముంది గనక? ఏ హరిజన నాయకుడి చేతనో ఒక సర్టిఫికేటు తీసికుని, తన అప్లికేషనుకు తగిలించటమేగా! ...అబ్బ! ఎంత తేలిగ్గా తేలిపోయిందీ! కాని...కాని నిజంగా అంత తేలికైన విషయమేనా అది? ఆ సర్టిఫికేటు తనకు ఆఫీసరు పదవి ఇప్పించొచ్చు. కాని దాంతో తాను ఇన్నాళ్ళూ ఎంతో శ్రద్ధతో కాపాడుకుంటూ వచ్చిన పరువూ అభిమానం ఏం కాను? తన చుట్టూ నిర్మించుకుంటూ వచ్చిన గాజుగోడలు ఒక్కసారి తుత్తునియలై పోవూ? అప్పుడు నగ్నంగా, నిజ స్వరూపంలో, కేవలం ఒక మాలవాడిగ నిలిచిపోడూ? ఆ అవమానాన్ని భరించే శక్తి తనకుందా? దాన్ని తలచుకుంటేనే హృదయం కంపించి పోతోంది.

ఛీ! తాను ఎందుకలా ఇన్నాళ్ళూ సత్యాన్ని కప్పిపుచ్చాలి? ఏం సాధించినట్టు? ఆఖరికి అదే ఇలా స్వయం కృతాపరాధంగా తన మెడకే ఉచ్చు వేస్తుందని కలలోనేనా అనుకున్నాడా? అంతకంటె హాయిగా తానె వరో ఆనాటి నించే నిర్భయంగా చెప్పుకుని వుంటే ఎంత బావుణ్ణు! ఇన్నాళ్ళూ తన్ను తాను మరుగు పర్చుకోటానికి పడ్డ అవస్థలూ తప్పి పోను, ఇప్పుడీ మనో బాధ వుండకపోను.

కాని ఎందుకలా చేశాడు. దీని కంతకీ బాధ్యుడు కేవలం తానేనా? ఇతర్లెవరూ కారా?... చప్పున వెంకట్రావు స్మృతిపథాన ఆచారి నిలిచాడు. వెంకట్రావు వళ్లు ఝల్లుమంది! ఆచార్ని ఈ జన్మలో మరవగలడా తాను?...

బాల్యస్నేహితుడు ఆచారి. అప్పటికింకా మతాలేవిటో. జాతులేవిటో. తెలియని ప్రాయం. మిడిల్ స్కూల్లో చదువుతూన్నాడు. క్లాసు కుర్రాళ్ళతో ఎంతో ఆప్యాయంగా కలిసి మెలిసి వుండేవాడు వెంకట్రావు. ఎలా కుదిరిందో గాని ఆచారితో మరీ మైత్రి కుదిరింది. ఎప్పుడూ ఇద్దరు ఒక జట్టుగా తిరిగేవారు. పరీక్షలు దగ్గరికొచ్చాక ఆచారి ఇంట్లో ఎలక్ట్రిక్ దీపాలు వున్నాయి గనక, ఇద్దరూ సాయంత్రం పూట అక్కడే చదువుకునేవారు. ఆచారి అమ్మా నాన్నా కూడా దయతోనే చూసేవారు వెంకట్రావుని.

ఒకరోజు లెక్క చేసికొంటూన్నప్పుడు ఆచారి తల్లి అడిగింది. "మీదే కులం అబ్బాయి?" అని. "మాలాళ్ళం," అన్నాడు వెంకట్రావు పలకపైనుంచి తల ఎత్తకుండానే. "మాలాళ్ళా." అంది ఉలిక్కిపడ్డ స్వరంతో. వెంకట్రావు తలెత్తి చూశాడు. ఆమె నిర్ఘాంతపోయి చూస్తూ నిలుచుని వుంది. వెంటనే గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది. వెంకట్రావుకేమీ అర్థం కాలా. ఆచారీ, తనూ ఒహరి మొహాలు ఒహరుచూస్తూ ఉండిపోయారు. కాసేపటికి లోపల్నించి ఆచారి తండ్రి పిలుపు వినిపించింది. ఆచారి వెంకట్రావుకేసి తిరిగి తిరిగి చూస్తూ లోపలికెళ్ళాడు. వెంకట్రావుకు ఇంకా అయోమయంగానే వుంది. తిరిగి లెక్కల్లో మునిగిపోయాడు. కాసేపటికి ఆచారి బిక్క మొహం వేసుకు వచ్చాడు. "వెంకూ! నువ్వింక వెళ్ళరా," అన్నాడు. "ఏం?" అన్నాడు వెంకట్రావు ఆశ్చర్యంతో.

"నాన్న నిన్ను వెళ్ళిపొమ్మన మంటున్నారు."

"ఎందుకూ?"

"ఏమో" అంటూ ఆచారి ఇంట్లోకి పరుగు తీశాడు.

వెంకట్రావు మనస్సు చివుక్కుమంది. తానేం అపరాధం చేశాడో చెప్పకుండానే తన్నలా ఇంట్లోంచి తరిమివేయడం చాలా అన్యాయంగా

తోచింది. పలకా, పుస్తకాలు చంకన పెట్టుకొని తిన్నగా లేచి వెళ్ళిపోయాడు.

కాని మనసు మనసులో లేదు. ఆ రాత్రి అన్నం సహించలా. నిద్ర కూడా సరిగ్గా పట్టలా.

రెండోరోజు స్కూల్లో ఆచారి కనిపించగానే "ఏంరా ఆచారీ! రాత్రి ఏమైంది?" అని ఆదుర్దాగా అడిగాడు వెంకట్రావు. ఆచారి మొహం తిప్పేసుకుని మరో వేపుకు వెళ్ళిపోయాడు.

వెంకట్రావు, "ఆచారీ! నిన్నేరా," అంటూ వెంటబడ్డాడు.

ఆచారి ఆగి, "నాతో మాట్లాడకు," అన్నాడు.

"ఏంరా? ఏమైందీ?" అన్నాడు వెంకట్రావు మరీ ఆశ్చర్యపోతూ.

"ఏం కాలేదు... నువు... మాలాడివి," అంటూ వెళ్ళిపోయాడు.

వెంకట్రావుకు ఒక్కసారి షాక్ తగిలింది! మాలాడైతే మాట్లాడ కూడదా?... 'ఛా! ఇదంతా ఎత్తు! మరేదో కారణం వుండి వుంటుంది' అనుకున్నాడు. 'అయినా వీడొక్కడు మాట్లాడకుంటే ఏం? మరెందరు లేరు క్లాసులో. వాళ్ళంతా మాట్లాడటంలా?' అని ధైర్యం తెచ్చుకున్నాడు.

కాని అదేం ఖర్మమో ఆనాటినించీ క్లాసులో ఎవరితో పేచీవచ్చినా. వెంకట్రావును ఇతర విధాల గెలవలేని వాళ్ళు "అరే పోరా మాలాడా," అనే ఆఖరు అస్త్రాన్ని ప్రయోగించేవాళ్లు. దాంతో వెంకట్రావు నవనాడులూ కుంగిపోయేవి. దుఃఖం పొంగుకొచ్చేది. కళ్ళల్లో నీళ్ళు తిరిగేవి. మరి మాట్లాడకుండా జారుకునేవాడు.

రానురాను వెంకట్రావుకు స్నేహితులంటేనే హడలెత్తిపోయింది. ఎప్పుడు ఎవరితో ఏ పేచీ వస్తుందోనని భయపడుతూండే వాడు. ఎవరి

తోనూ అనవసరంగా మాట్లాడేవాడు కాదు. ఎవరి ఇళ్ళకీ వెళ్ళేవాడు కాడు. ఎంతో జాగ్రత్తగా మెలుగుతూ ఎల్లాగో అల్లాగ మిడిల్ స్కూల్ పూర్తి చేశాడు.

తన స్కూలు పిల్లలంతా దగ్గర్లో వున్న హైస్కూల్లో చేరితే వెంకట్రావు ఒక్కడు మాత్రం పట్టుబట్టి తన ఇంటికి చాలా దూరంలో వున్న మరో హైస్కూల్లో చేరాడు. అప్పటినించి ఒక నూతన జీవిత మారంభించటానికి నిశ్చయించుకున్నాడు. స్కూల్లో తాను మాలవాడని తెలియకుండా అన్ని విధాలా జాగ్రత్తపడ్డాడు. ముఖ్యంగా, ఎవ్వరితోనూ పరిచయానికి మించిన స్నేహం చెయ్యకపోయేవాడు. ఎవరైనా కాస్త స్నేహపాత్రంగా మెలగ ప్రయత్నించగానే బెదిరిపోయి సున్నితంగా తప్పించుకునేవాడు. రానురాను వెంకట్రావుకు స్నేహితుల్లేని వొంటరి జీవితం బాగా అలవాటు పడిపోయింది. దాంతో తన రహస్యాన్ని సునాయాసంగా కాపాడుకోగలుగుతూ వచ్చాడు.

ఒకనాడు ఆచారి ఆకస్మాత్తుగా కలిశాడు. అతనే గుర్తుపట్టి, వచ్చి కరస్పర్శ చేసేదాకా వెంకట్రావుకు తెలీనే లేదు. అతణ్ణి గుర్తించగానే వెంకట్రావుకు గుండె దడ పుచ్చుకుంది. అతనెంతో స్నేహంగా ఎన్నెన్నో విషయాలు చెబుతూ ఏమేమో అడిగాడు. వెంకట్రావు జవాబులుకూడా చెప్పాడు. కాని అతను విడిపోయేదాకా మనసు మనసులో లేదు. ఆచారి స్పష్టంగా అనకపోయినా అతని కళ్ళల్లో. అతని మాటల్లో, అతని ధోరణిలో చిన్నప్పటి సంఘటనకు క్షమాపణ వేడుకుంటూన్నట్టుగానే కనిపించింది. అయినా వెంకట్రావు ఈ జన్మలో ఆచారిని మరిచిపోగలడా?

ఒక్కొక్కసారి అనవసరంగా తానీ విషయంలో ఇంత జాగ్రత్త పడుతూన్నానేమో అని తర్కించుకునేవాడు. ఈ రోజుల్లో పట్నం చోట, చదువుకున్న వాళ్ళ మధ్య వుంటూకూడా ఇలా భయపడటం సమంజసమేనా అని ప్రశ్నించుకునేవాడు. కాని వెంటనే కొన్ని విషయాలు జ్ఞాపకం రాగానే తల వొంచేసుకునేవాడు.

కాలేజీ వక్తృత్వపు పోటీలో అస్పృశ్యతమీద ఏకధాటిగా ఉపన్యాసందంచి, బహుమతి పొందిన కుర్రాడు రెండో రోజు మరో కుర్రాణ్ణి "ఒరే. కోమటోడా! రారా" అని ఎగతాళి చేస్తోంటే విని వెంకట్రావు నిలువునా నీరయాడు. కాలేజీ హాస్టల్లో ఒకరోజు భోజనాలప్పుడు మంచి నీళ్ళు పోసినవాడు బ్రాహ్మడు కాడని తెలిసి కొందరు కుర్రాళ్ళు భోంచేయకుండా వెళ్ళి వార్డన్‌కు రిపోర్టు చేశారు. దాంతో ఆ నిర్భాగ్యుడి ఉద్యోగం ఊడిపోయింది. ఇలాంటివి మరెన్నో చిన్నచిన్న సంఘటనలు జరుగుతుండేవి. దాంతో వెంకట్రావు తన రహస్యం కప్పిపుచ్చటంలో మరీ జాగ్రత్తపడేవాడు.

ఉద్యోగంలో చేరాక ఒక కొత్త వాతావరణంలో కాలుపెట్టానని అనిపించింది వెంకట్రావుకు. ఆఫీసువాళ్ళంతా చదువుకున్న వాళ్ళు. భార్యా పిల్లలూ, సంసారం, బాధ్యతగల పెద్దమనుషులు. స్కూలు, కాలేజీ కుర్రాళ్ళలా చిలిపిగా ప్రవర్తించరు. ఇక్కడ తన రహస్యం బయటపడ్డా ఫరవా లేదేమో అనిపించింది వెంకట్రావుకు మొదట్లో. కాని అనతికాలంలోనే తెలిసికున్నాడు. ఈ పెద్ద మనుషులు ఎంత చదువుకున్న వాళ్ళైనా, ఆఫీసులో ఆర్థిక, రాజకీయ సాంఘిక విషయాల పైన ఎంతో అభ్యుదయ ధోరణిలో మాట్లాడినా, మామూలు ఆచార, వ్యవహార విషయాల్లోనూ, మూఢ నమ్మకాల్లోనూ చదువురాని భార్యలకు పూర్తిగా దాసులు! ఆఖరికి, ఆఫీసులో ప్యూను చేతినీళ్లుకూడా తాగలేక ఎండాకాలం దినమల్లా గింజుకు లాడే పెద్దమనుషుల్ని చూడగానే హడలెత్తిపోయాడు వెంకట్రావు. వీళ్ళకే గనక తన రహస్యం తెలిసిపోతే తన్ను తిన్నగా బ్రతకనిస్తారా అనుకున్నాడు. వెంకట్రావు అనుమానం నిర్ధారణ పడటానికి ఆఫీసువాళ్లు అప్పుడప్పుడు హరిజన నాయకులపైనా, మంత్రులపైనా విసిరే ఎగతాళి వాక్యాలు కూడా కారణమైనాయి.

ఆఫీసులోకల్లా తక్కువ వాళ్ళందరికీ పూర్తిగా భిన్నం చిన్న ఆఫీసరు. అతనూ చిన్నవాడే. మహా అయితే వెంకట్రావు కంటే ఏ పదేళ్ళో

ఎక్కు వుంటాయి. అతని అభిప్రాయాలకూ, ఆచరణకు అంతరం వుండదు. దృఢ విశ్వాసాలు గల మనిషి. కులమత భేదాల్ని, ఆచార వ్యవహార మూఢ నమ్మకాల్నీ తీవ్రంగా ఖండిస్తాడు. అతనంటే చాలా గురి వెంకట్రావుకు. సాధ్యమైనంత మట్టుకు అతణ్ణి అనుకరించాలనే చూస్తూంటాడు వెంకట్రావు. ఏనాటికేనా తనూ అతనిలా ధైర్యంగా 'నేను కులంలేనివాణ్ణి' అని అనగలుగుతానేమో అన్న ఆశ! కాని మధ్యాహ్నం టీ క్లబ్బులో ఎప్పుడు ఆ విషయాలపైన చర్చ జరిగినా వెంకట్రావుకు ప్రాణసంకటం గానే వుండేది. నోటినించి ఏమాట పెగిలితే తన గుట్టు బయటపడుతుందే మోనన్న భయం కొద్దీ మౌనం వహించేవాడు.

నూటికి పన్నెండు పోస్టులు షెడ్యూలు తరగతులకు ప్రత్యేకింప బడాలనే ప్రభుత్వపు ప్రకటన వచ్చినరోజు కూడా వెంకట్రావు ఎంతో బాధపడ్డాడు. ఎవరికి చెప్పుకోవాలో తెలీలేదు. చిన్న ఆఫీసరే ఏమైనా సలహా ఇస్తాడేమో అనుకున్నాడు. కాని ఆ మధ్యాహ్నం టీ క్లబ్బులో అతను ప్రభుత్వం చేసింది మంచిపని కాదనీ, దాంతో కుల మత భేదాలు పెరుగుతాయనీ, ఆర్థికంగా ఏ కొద్దిమందో బాగుపడ్తారుగాని ఆయా జాతుల వారంతా అలాగే వుండిపోతారనీ తీవ్రంగా ఖండించేసరికి వెంకట్రావుకు అతనితో తన విషయం ఎత్తటానికికూడా ధైర్యమాగలా.

అయినా ఆ ఆఫీసరంటే వెంకట్రావు హృదయంలో గౌరవం హెచ్చిందేగాని తగ్గలేదు. ఏనాటికేనా తనని సరిగ్గా అర్థం చేసుకోగలిగే శక్తి అతనొక్కడిలోనే వుందన్న దృఢనమ్మకం వెంకట్రావుకు కలిగింది. అతనింటికి తరుచు వెళుతుండేవాడు. ఆఫీసరు భార్యా చదువుకుందే. ఇద్దరూ తనతో ఎంతో ఆప్యాయంగా మెలగేవారు. అయినా తన రహస్యం బయటపెట్టే ధైర్యం లేకపోయింది. కాని ఏనాడో ఓనాడు వీలు చూసుకుని వాళ్ళకంతా చెప్పేయాలనే కుతూహలంగా వుంది...కాని...

ఒకసారి సెలవు రోజున భార్యాభర్తలు టీ పుచ్చుకుంటూన్న సమయానికి వెంకట్రావు వెళ్ళాడు. తననీ ఆహ్వానించారు. వెళ్ళి కూచుని టీ

అందుకున్నాడు. ఇంతలో వాళ్ళ అయిదేళ్ళ అబ్బాయి చొక్కాపైనంతా టీ వొలకబోసుకొని వంటింట్లోంచి వచ్చాడు. అది చూసి తల్లి "ఓరి పెధవా! ఇదేం మాదిగ వేషంరా?" అంది. వెంకట్రావు వీపుమీద ఎవరో పెద్దగా చరిచినట్టు ఉలిక్కిపడ్డాడు. ఆఫీసరు నవ్వుతూ కొడుక్కేసి చూస్తూన్నాడు. ఆమె మాటలకంటే అతని మౌనం వెంకట్రావును ఎక్కువ బాధించింది. 'వీళ్ళూ ఇంతేనా?' అనుకున్నాడు. ఆనాటినించి ఆ యింటికి వెళ్ళటమే మానేశాడు.

ఈ జ్ఞాపకాలతో పబ్లిక్ గార్డెన్సులో చెట్టుక్రింద చతికిలబడి వున్న వెంకట్రావు బుర్ర వేడెక్కిపోయింది. పని చేయడం మానివేసింది. కళ్ళు మూతలు పడ్డాయి. నేలమీదకు వొరిగాడు, అలా ఎంతసేపు పడుకొని వున్నాడో!

*　　*　　*　　*　　*

"వెంకట్రావ్!... వెంకట్రావ్?" ఎవరో భుజంతట్టి లేపుతున్నారు. కళ్ళు తెరిచాడు. కళ్ళెదుట ఆఫీసరు మొహం కనిపించింది. చప్పున లేచి కూచుని చుట్టూ కలయచూశాడు. పబ్లిక్ గార్డన్స్‌లోనే వున్నాడు. సాయంత్రమైపోయింది. ఆఫీసరు ప్రక్కనే అతని భార్యా, పిల్లవాడూ నిలచుని వున్నారు.

"ఏంవిటి వెంకట్రావ్! ఇక్కడ పడుకున్నావేం? వొంట్లో బాగు లేదా?" అంటూ ఆఫీసరు వెంకట్రావు నొసట చెయ్యి వేశాడు. చెయ్యి తగలగానే అదిరిపడి వెనక్కు తగ్గాడు వెంకట్రావు, "నన్ను ముట్టుకోకండి," అన్నాడు.

"ఏం? ఎందుకూ?" ఆశ్చర్యంతో అడిగాడు ఆఫీసరు.

"నేను...నేను మాలవాణ్ణి"

ఆఫీసరు బొమ్మలు ముడిచి, ఒకసారి భార్యకేసి చూసి, "ఏఁవిటి వెంకట్రావ్? నాకు అర్థంకాలా," అన్నాడు.

"అదిగో చూడండి," అంటూ పత్రిక్కేసి చూపాడు వెంకట్రావు.

ఆఫీసరు పత్రిక తీసుకుని వెంకట్రావు చూపిన ప్రకటన చూశాడు. "ఇదా? ఇది నేనివాళ ఆఫీసులోనే చూశాను," అన్నాడు.

"నేను అప్లయ్ చేస్తున్నాను."

"చెయ్యి తప్పకుండా చెయ్యి. నేనే నీతో..."

"అదికాదు. రిజర్వు పోస్టుకు చేస్తున్నాను."

ఆఫీసరు ఒక్క క్షణం ఆగి, అంతా అర్థమైనట్టు చిరునవ్వు నవ్వి, తిరిగి మరోసారి భార్యకేసి చూశాడు. "ఓహో. ఇదాగొడవ!...రా.. లే," అన్నాడు.

"ఎక్కడికి "

"ఇఁటికి. ఎప్పుడు భోంచేశావో ఏమో..."

"మీ ఇంటికే! వద్దు...వద్దు... నేను మాలవాణ్ణి," అన్నాడు ఆత్రంగా వెంకట్రావు.

"ఛా! అవేంమాటలు వెంకట్రావుగారూ! ఇంతేనా మమ్మల్ని అర్థం చేసుకుంది? లెండి, లెండి," అంది ఆఫీసరుభార్య.

వెంకట్రావు కొన్ని క్షణాలు శూన్యంగా ఆమెకేసి చూసి మౌనంగా లేచి, కోటు తీసికుని తలవంచుకుని నడిచాడు.